సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



పాడేరు పట్టణంలో యాంటీ లార్వా ఆపరేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు : దోమలను లార్వా దశలోనే నిర్మూలించేందుకు వైద్య సిబ్బంది పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా సూచించారు. గురువారం మినుములూరు పీహెచ్‌సీ ఆధ్వ ర్యంలో జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో సిబ్బంది చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శేషయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గురువులే మార్గదర్శకులు

- అరకు ఎంపీ తనూజరాణి



వనుగుపల్లిలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తనూజరాణి

పాడేరు : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకులు గురువులే అని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజరాణి అన్నారు. మండలంలోని వనుగుపల్లి పంచాయతీ బిరిమిశాల, జామిగూడ గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో పునర్నిర్మించిన పాఠశాల భవనాలను గురువారం ఆమె స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున పాఠశాల భవనాలను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులను అరకు ఎంపీ సత్కరించారు. సర్పంచ్ ముఖ్వల మీనా, ఎంపీటీసీ సభ్యురాలు రేగం భానుమతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్ లంకెల చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌గా శౌర్యమన్ పటేల్ బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పూలమొక్కను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్

సాక్షి,పాడేరు: పాడేరు సబ్‌కలెక్టర్‌గా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శౌర్యమన్ పటేల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.అంతకు ముందు ఆయన మోదకొండమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిముడు కోటిబాబు, ఇతర కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించి అమ్మవారి చిత్రం, ప్రసాదం అందజేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.

శ్రీవారి లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్ ప్రారంభం



శ్రీవారి లడ్డు ప్రసాద విక్రయ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం: ఇక్కడికి సమీప ఐ.పోలవరంలోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయ కౌంటర్‌ను గురువారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రారంభించారు. ముందుగా స్వామివారిని ఆమె దర్శించుకున్నారు. ఆలయ అధికారి శ్రీనారాయణరాజు, వేదపండితులు శ్రీసాయిరామశర్మ, అర్చకస్వాములు గోవర్ధనం, శ్రీమణికంఠాచార్యులు, ధర్మప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతగా రోగులకు భోజనం

- వైద్యవిధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్

ముంచంగిపుట్టు: రోగులకు అందించే భోజనం నాణ్యతగా ఉండాలని వైద్యవిధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణారావు ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు. సీహెచ్‌సీలో శ్లాబ్ లీక్ అవుతున్న ప్రాంతాన్ని, రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం వైద్యులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు.

అనంతగిరి ఘాట్ రోడ్డులో కూలిన చెట్టు: నిలిచిన ట్రాఫిక్

అనంతగిరి (అరకు రూరల్): అరకు- విశాఖ రోడ్డులో అనంతగిరి జంగిల్ బెల్స్ సమీపంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో కూలిపోయింది. దీంతో ఇరు వైపులా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కూలిన చెట్టును తొలగించే పనుల్లో హైవే అధికారులు నిమగ్నమయ్యారు.

గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చుతోంది. రెండు నెలల వ్యవధిలో ఇప్పటికే పరివాహక ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిన గోదారమ్మ నీటిమట్టం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు అంతకంతకూ పెరుగుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి రెండవ ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉంది. మరోపక్క శబరి నది నీటిమట్టం కూడా పెరుగుతుండటంతో విలీన మండలాల అధికారులు అప్రమత్తమయ్యారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ముంపు ప్రభావిత ప్రజలకు సూచిస్తున్నారు.

విలీనంలో వరద వర్రీ

- ఉగ్రరూపం దాల్చుతున్న గోదావరి
- రెండవ ప్రమాద హెచ్చరికకు చేరువలో నీటిమట్టం
- మరోపక్క పెరుగుతున్న శబరి ఉధృతి
- వాగుల ముంపులో రహదారులు
- అప్రమత్తమైన అధికారులు



ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి-326ను ముంచెత్తిన కుయిగూరు వాగు వరద నీరు

ఎటపాక: నెలరోజులక్రితం సంభవించిన గోదావరి, శబరి వరదలకు ప్రజలు అవస్థలు పడ్డారు. రైతులు, కూలీలు, ఇతర అన్ని వృత్తుల వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెట్టేబేడా సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. తగ్గుముఖం పట్టడంతో తిరిగి వచ్చారు. మళ్లీ ఇప్పుడు గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో రెండవ ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుధవారం రాత్రి కొద్దిగా తగ్గినట్టే తగ్గి గురువారం ఉదయం నుంచి క్రమేపీ పెరుగుతూ సాయంత్రం 5 గంటలకు 45.50 అడుగులకు చేరుకోవడంతో మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

- నెల్లిపాక నుంచి వీరాయిగూడెం వెళ్లే రహదారి నీట మునగటంతో బొట్లకుంట, వీరాయిగూడెం, నర్సింపేటకు రాకపోకలు నిలిచిపోయాయి.
- కూనవరం,ఎటపాక సరిహద్దు ప్రాంతం మురుమూరు వద్ద రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిపివేశారు. రహదారుల వద్ద ఎవరు నీళ్లలోకి వెళ్లకుండా ఎస్‌ఐ పార్థసారధి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నెల్లిపాక, నందిగామ, తోటపల్లి, మురుమూరు వాగులకు గోదావరి వరద పోటెత్తడంతో పరివాహక ప్రాంతంలోని పొలాలు జలమయం అయ్యాయి.

తాలిపేరు నుంచి 90 వేల క్యూసెక్కులు విడుదల

చింతూరు: ఈ ఏడాది ఎటపాక, కూనవరం మండలాల్లో రెండోసారి, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో మూడోసారి వరద సంభవించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు 44.3 అడుగులకు చేరుకున్న నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 43.5 అడుగులకు తగ్గింది. అనంతరం క్రమేపీ పెరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భద్రాచలం ఎగువనున్న తాలిపేరు జలాశయం నిండుకోవడంతో 90 వేల క్యూసెక్కులు దిగువన ఉన్న గోదావరిలో విడుదల చేయడంతో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది.

- వీఆర్‌పురం మండలంలో కన్నాయిగూడెం, చింతరేగుపల్లి, సీతంపేట, మొద్దులగూడెం వద్ద రహదారుల పైకి వరదనీరు చేరడంతో వరుసగా రెండోరోజు కూడా 28 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- శబరినది ఎగపోటుకు గురికావడంతో చింతూరు మండలంలో సోకిలేరు, జల్లివారిగూడెం, కుయిగూరు, చంద్రవంక, చీకటివాగుల వరదనీరు రహదారుల పైనుంచి ప్రవహిస్తోంది. కుయిగూరు వాగు పొంగి జాతీయ రహదారి-326పై చేరడంతో ఆంధ్రా నుంచి ఒడిశాతోపాటు ఇదే రహదారిలోని మండలంలోని నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- సోకిలేరు, జల్లివారిగూడెం, చంద్రవంక, చీకటివాగులు పొంగడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య, చింతూరు మండలంలోని 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- మండలంలో సోకిలేరు, గోపాలపురం, పూసువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండరెడ్డి గ్రామమైన ఎర్రగొండపాకలలో చదల పండారెడ్డి, సాందుల కన్నపురెడ్డి ఇళ్లు నీటమునిగాయి.
- గోపాలపురం వాగు చింతూరు, మోతుగూడెం రహదారిపైనుంచి ప్రవహించడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



చింతూరు మండలం ఎర్రగొండపాకలలో పూసు వాగు ఉధృతికి మునిగిన తాటాకిల్లు



చింతూరు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి నది

వరద ప్రభావిత కుటుంబాలకు నిత్యావసరాలు

గోదావరి వరద కారణంగా వీఆర్‌పురం మండలంలో ప్రభావితమైన 3,451 కుటుంబాలకు నిత్యావసరాలు, దోమతెరలు అందించినట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని 95 మంది గర్భిణులను ముందస్తుగా సమీప ఆస్పత్రులకు తరలించామన్నారు. వీఆర్‌పురం మండలంలో 50 ఎకరాలు, కూనవరం మండలంలో 15 ఎకరాల్లో వరిపంట ముంపునకు గురైందని పేర్కొన్నారు. వీఆర్‌పురం మండలంలో ఏడు, కూనవరం మండలంలో రెండు, ఎటపాక మండలంలో మూడు, చింతూరు మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు ముంపునకు గురైనట్లు పీవో తెలిపారు. పీవో, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

కూనవరం వద్ద పొంగిన ఉభయ నదులు

కూనవరం: శబరి, గోదావరి నదులు పొంగి ప్రవహిస్తుండటంతో కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై పోలిపాక, మురుమూరు వద్ద వరద నీరు చేరింది. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. టేకులబోరు-కొండ్రాజుపేట రహదారిని శబరి వరద ముంచెత్తడంతో రెండవరోజు కూడా కొండ్రాజుపేట, శబరి కొత్తగూడెం, పూసుగు గూడెం, శ్రీరామపురం, వెంకన్నగూడెం, కొత్తూరు, చినార్కూరు గ్రామాలకు రాకపోకల నిలిచిపోయాయి. కూనవరం వద్ద సాయంత్రం ఆరు గంటలకు గోదావరి నీటి మట్టం 18.82 మీటర్లు(43.5 అడుగులు) నమోదైందని సీడబ్ల్యూసీ అధికారవర్గాలు తెలిపాయి.



చీకటివాగును పరిశీలిస్తున్న పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



కొండ్రాజుపేట రహదారిని ముంచెత్తిన శబరి నది వరద నీరు



కూనవరం మార్గంలో మురుమూరు వద్ద రాకపోకలను నిలిపివేసిన పోలీసులు

ప్రమాదస్థాయికి జోలాపుట్టు నీటిమట్టం



వరద నీటితో పూర్తిగా నిండిన జోలాపుట్టు జలాశయం

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరుకుంది. ఈ ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 2,750 అడుగులు, గురువారం నాటికి 2747.35 అడుగులు నీటి నిల్వ నమోదయింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన స్పిల్‌వేకు ఉన్న ఎనిమిది గేట్లపై నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే గేట్లు ఎత్తి డుడుమకు నీటిని విడుదల చేస్తామని జలాశయ సిబ్బంది తెలిపారు. జోలాపుట్టు దిగువన ఉన్న డుడుమ జలాశయ నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్ నీటి మట్టం 2,590 అడుగులు కాగా గురువారం నాటికి 2584.40 అడుగులుగా నమోదయింది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు జనరేటర్ల సాయంతో 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రస్తుతం జరుగుతోంది. జలాశయాల నీటి మట్టాలు ప్రమాదస్థాయికి చేరడంతో ప్రాజెక్టులకు దిగువనున్న రంగబయలు, వనుగుమ్మ, మాకవరం, దొడిపుట్టు, బుంగాపుట్టు, జోలాపుట్టు పంచాయతీల్లో గిరిజన గ్రామాలతో పాటు ఒడిశాలోని గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు.



మూసి ఉన్న జోలాపుట్టు స్పిల్‌వే గేట్‌పై నుంచి దిగువకు వచ్చేస్తున్న వరదనీరు

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలకపాత్ర



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై ఎస్పీ అమిత్‌బర్దర్, జేసీ అభిషేక్‌గౌడ్, పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తదితరులు



గురువును సత్కరించి ఆశీర్వాదం పొందుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



ఆర్‌వీనగర్ పాఠశాలలో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక కాఫీ అతిథి గృహంలో గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కలెక్టర్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలను చేసి వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు సమాజాభివృద్ధికి మూలపురుషుడన్నారు. ప్రతిఒక్కరిని బాల్య దశ నుంచి విద్యావంతుడుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులంతా ఆదర్శనీయులన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కూడా అదేస్థాయిలో విద్యను కోరుకుంటున్నారని, ఉపాధ్యాయులు కూడా వారి అభిరుచి,ఆలోచనలకు అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. విద్యాభివృద్ధిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బోధన విధానంలో మార్పులు రావాలని, గురువులంతా విద్యార్థులకు మార్గదర్శకులు కావాలని ఆయన సూచించారు.

ఉన్నతంగా తీర్చిదిద్దాలి: ఎస్పీ అమిత్ బర్దర్

గిరిజన విద్యార్థులంతా చదువుకునే సత్తా ఉన్నవారేనని అయితే వారిలో భయాన్ని పొగొట్టి, ఉన్నత చదువులు, ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల లక్ష్యాలను నిర్మించాలని ఎస్పీ అమిత్‌బర్దర్ సూచించారు. గంజాయి వంటి చెడు రుగ్మతలపైన పాఠశాల స్థాయిలోనే చర్చ జరిగి, మంచి మార్గంలో గిరిజన సమాజం నడుచుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

నైతిక విలువలతో కూడిన విద్య అందించాలి: జేసీ అభిషేక్ గౌడ్

గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక విద్య దశ నుంచి నైతిక విలువలతో కూడిన విద్యను గిరిజన విద్యార్థులకు అందించాలని జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్ పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయం: ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత శాతం పెంచి.గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని చెప్పారు. చదువు నేర్పిన గురువుకు పాదాభివందనం చేసుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులతో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

గిరిజన విద్యాభివృద్ధికి మరింత శ్రమించాలి: అరకు ఎమ్మెల్యే రేగం

గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులంతా మరింత శ్రమించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు.అన్ని తరగతులలోను వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారంతా నైపుణ్యంతో కూడిన విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్వో పద్మావతి, డీఈవో పి.బ్రహ్మజీరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఎమ్మెల్యేకు సత్కారం

గూడెంకొత్తవీధి: మండలంలోని ఆర్‌వీనగర్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

రంపచోడవరం: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక ఐటీడీఏలో గురువారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలు అందరినీ రెన్యువల్ చేస్తామన్నారు. డీఎస్సీకి గిరిజన అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు, ఎంఈవోలు రామకృష్ణ, బాలుదొర, తాతబ్బాయి , శ్రీనివాసరావు, టి.మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంపు రహదారుల వద్ద కాపలా



కొండ్రాజుపేట రోడ్డును పరిశీలిస్తున్న పీవో

కూనవరం: వరద ముంపునకు గురైన రహదారులు, వాగుల వద్ద సిబ్బందిని కాపలా ఉంచాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. వరద ముంపునకు గురైన కొండ్రాజుపేట రహదారిని గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బందికి కాపలా బాధ్యత అప్పగించాలని సూచించారు. అనంతరం కొండ్రాజుపేటలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ప్రత్యేకాధికారి రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పనశ్రీ, తహసీల్దార్ నాగబాబు, వీఆర్వో ధర్మరాజు పాల్గొన్నారు.

వాగులో గిరిజనుడి గల్లంతు

చింతూరు: వీఆర్‌పురం మండలం తుష్టివారిగూడెం వద్ద బుధవారం రాత్రి వాగుదాటే క్రమంలో గిరిజనుడు కారం నాగేశ్వరరావు(26) గల్లంతయ్యాడు. అదేరోజు ఉదయం అడవి వెంకన్నగూడెంలో ఉన్న తన సోదరి ఇంటికి వెళ్లిన అతను సాయంత్రం తిరిగివచ్చే క్రమంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటే క్రమంలో గల్లంతయ్యాడు. గురువారం తహసీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా అతని ఆచూకీ లభ్యం కాలేదు.

ఆంధ్ర రిజర్వాయర్‌లో మునిగి జిల్లావాసి మృతి

మెంటాడ (విజయనగరం): ఆంధ్ర రిజర్వాయర్‌లో మునిగి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ బీటుగరువు గ్రామానికి చెందిన గమ్మెళ భీమరాజు(22) అనే యువకుడు మృతి చెందాడు. ఆంధ్ర రిజర్వాయర్‌లో చేపల వేటకు పరిసర గ్రామాల గిరిజనులు వస్తుంటారు. ఎప్పటిలాగే మంగళవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో బీటుగరువు గ్రామానికి చెందిన వలువురు చేపల వేటకు వచ్చారు. భీమరాజుతో పాటు ముగ్గురు యువకులు వల వేసి చేపలు తీసే సమయంలో ప్రమాదవశాత్తూ భీమరాజు నీటిలో మునిగిపోయాడు. ఎంతకీ భీమరాజు రాకపోవడంతో వేరే మార్గంలో వెళ్లిపోయి ఉంటాడని భావించి ఒడ్డున ఉన్న మిగిలిన ముగ్గురు వెనక్కి వెళ్లిపోయారు. భీమరాజు ఇంటికి చేరలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు మృతదేహం తేలడం చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరిన పోలీసులు విచారణ చేసి భీమరాజు మృతదేహంగా నిర్ధారించారు.

ఆపదలో ఉన్న వారికి రక్తదానం



పాడేరు జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సన్యాసిదొర

జి.మాడుగుల: ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు తాను రక్తదానం చేసేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉంటానని వైఎస్సార్‌సీపీకి చెందిన లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. గురువారం ఆయన పాడేరు జిల్లా ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న గంగపూజారి బాలమ్మకు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల వయసు నుంచి తాను రక్తదానం చేస్తున్నానని చెప్పాడు. ఇప్పటివరకు 13 సార్లు రక్తదానం చేసినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం: ఈనెల 6వ తేదీ శుక్రవారం వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వై.రామవరం ఏఈ దొర తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.

కేర్ టేకర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జపాన్ ఆస్పత్రిలో కేర్ టేకర్ ఉద్యోగాలకు అర్హులైన ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యువతీ యువకులకు భాష నేర్పించి ఉద్యోగం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి బెంగళూరు నావిస్ హెచ్ఆర్ సెంటర్‌లో ఆరునెలల కాలం పాటు భోజన వసతితో కూడిన శిక్షణ ఇస్తామన్నారు. కోర్సు ఫీజు రూ.3.5 లక్షలు ఉంటుందని, ఇందులో రూ.25 వేలు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ భరిస్తుందన్నారు. మిగిలిన ఫీజును శిక్షణ పొందే అభ్యర్థులు మూడు దఫాలుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆరు నెలల శిక్షణ అనంతరం జపాన్‌లోని ఆస్పత్రిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1.10 లక్షల నుంచి 1.40 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల 32 ఏళ్లలోపు వయసు గల యువతీ,యువకులు పూర్తి వివరాలకు 9949927899 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.